# ఇరవై ఆరు గంటలు



పి.ఎస్.నారాయణ

# ఇరవై ఆరు గంటలు

పి. ఎస్. నారాయణ

## నవల

# ఇరవై ఆరు గంటలు

## (నవల)

**స్వాతి**

మాస పత్రిక

సెప్టెంబర్, 2005 సంచిక

అనుబంధ నవలగా

ప్రచురింపబడింది.

**వెల:రు. 120**

గమనిక

ఈ నవలలోని పాత్రలు, సంఘటనలు–
అన్నీ కల్పితాలు, ఎవర్నీ ఉద్దేశించినవి కావు.
ఎక్కడయినా పోలికలు, సామ్యాలూ
కనిపించినా అవి యాదృచ్ఛికమే.

–రచయిత

# ఇరవై ఆరు గంటలు

"యువర్ ఎటెన్షన్ ప్లీజ్!– టు సెవన్ టు త్రీ– హైద్రాబాద్ న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ యీజ్ ఎరైవింగ్ ఆన్ ప్లాట్‌ఫారం నెంబర్ వన్ ఇన్ ఫ్యూ మినిట్స్!"

బెంచీమీద కూర్చునివున్న ఆదిత్య ఒక చేతిలోకి సూట్‌కేసును, మరో చేతిలోకి హ్యాండ్ బ్యాగ్‌ను అందుకున్నాడు. కావేరి ప్లాస్టిక్ తాళ్ళతో అల్లిన బుట్టను, వాటర్ క్యాన్‌ను అందుకొని నిలబడింది.

వాళ్ళకు ఎడం చేతివైపు ప్లాట్‌ఫారం మీదవున్న గడియారం అప్పుడు ఏడు గంటలు చూపిస్తోంది.

శీతాకాలపు చల్లటిగాలి వెచ్చగా స్వెట్టర్ వేసుకున్నా వణుకు పుట్టిస్తూనే వున్నది.

ప్లాట్‌ఫాం మీద ప్రయాణీకుల్లో ఒక్కసారిగా చలనం బయల్దేరింది. మధ్యనుండి దూసుకుపోతున్న ట్రాలీల కరకు శబ్దం, ఎర్రటి చొక్కా పోర్టర్ల హడావుడి...

"రెండు ఏడు రెండు మూడు– హైద్రాబాద్‌నుండి న్యూఢిల్లీ వెళ్ళే ఏపీ ఎక్స్‌ప్రెస్ మరి కొద్ది నిముషములలో ప్లాట్‌ఫాం నంబరు ఒకటి మీదకు వచ్చుచున్నది!"

"మన బోగీ నంబరు ఎంతండీ?" కావేరి అడిగింది భర్తను.

"ఎస్ సెవన్!"

"సీట్ నంబర్లు?"

"యిరవై అయిదు... యిరవై ఎనిమిది... రెండూ క్రింద బెర్తులే!" అన్నాడు ఆదిత్య భార్య ముఖంలోకి చూస్తూ.

"రెండూ పై బెర్తులు అయితే బాగుండేది!"

"అదేం... పైకి ఎక్కుడూ, దిగుడూ కష్టంకదా!"

"రాత్రికి భోజనంచేసి పైకెక్కి పడుకుంటే తెల్లవారేటంతవరకూ మనజోలికి వచ్చే వాళ్ళుండరు!" అన్నది కావేరి.

భార్య ముఖంలోకి రెప్పలార్పకుండా చూచాడు కొద్ది క్షణాలు. "దాన్దేమున్నది... మనకు పై బెర్తులు కావాలీ అనుకుంటే కళ్ళకు అద్దుకు ఇస్తారు ఎవరైనా!" నవ్వాడు.

"ఏం అద్దుకుంటారేం కళ్ళకు?" కావేరి చాలా హుషారుగా వున్నది.

ఆమె ఢిల్లీకి వెళ్దామని ఆరునెలలబట్టీ పోరుతుంటే ఆయన ఏ కళనున్నారో ఇప్పటికి 'సరే' అన్నారు.

అక్కడ ఆమె అన్నయ్య ఉన్నాడు. బ్యాంకులో ఆఫీసరు. నార్తులో మూడేళ్ళు చేయాలనే నిబంధనక్రింద రెండు సంవత్సరాల క్రితం– తనకు పెళ్ళయిన నెలలోనే హైద్రాబాద్‌నుంచి ఢిల్లీకి వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు చెల్లెలికీ, బావగారికీ చెప్పాడు. "మేం వెళ్ళి సెటిల్ అవ్వగానే ఫోను చేస్తాను... మీరు తప్పకుండా రావాలి!" అంటూ.

– కానీ, బయల్దేరితేనా?... ఎప్పటికప్పుడు ఏదో ఒక వంక...

చివరకు పదిరోజుల క్రితం ఓ ఉత్తరం ఘాటుగా రాశాడు బావగారికి. "ఇక నేనుండేది ఇక్కడ ఒక్క సంవత్సరం– ఇప్పటికయినా మీరు వీలుచూసుకొని ఓ పదిరోజుల పాటు వుండేలా రాకపోయారో– ఇంత సుఖంగా మీరు మరోసారి మన రాజధాని ఢిల్లీని చూడలేరు... తరువాత మీరెక్కడున్నా, మీరు రమ్మనమన్నా... నేనూ ఇలాగే చేస్తాను!" అంటూ.

ఆ ఉత్తరం దెబ్బకే కాబోలు– ఒకరోజు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి

వస్తూనే, "దీపావళికి మూడు రోజులు ముందుగా మనం మీ అన్నయ్య దగ్గరకు ఢిల్లీ వెళుతున్నాం... ఇవ్వాళే మా స్నేహితుడికి టిక్కెట్లు తీసుకోమని డబ్బులు గూడా ఇచ్చాను!" అన్నాడు.

కావేరి ఎగిరి గంతేసింది ఆమాటలు వింటూనే... మరునాడు రాత్రే వాళ్ళన్నయ్యకు ఫోను చేసి చెప్పింది. "ఈ నెల ముప్ఫయి ఒకటి గురువారం ఏపీకి మేం బయల్దేరుతున్నాం... ఒకటో తారీఖు పొద్దున స్టేషన్‌కు రా... ఏడు సాయంత్రం మళ్ళా అక్కడ బయల్దేరుతాం... అక్కడ దొరకనివి, ఇక్కడ దొరికేవి ఏమైనా వుంటే చెప్పు- వచ్చేటప్పుడు తీసుకు వస్తాం... ఇంకా కావాల్సినంత టైం వున్నది!" నాన్‌స్టాప్‌గా మాట్లాడుతుంటే అన్నయ్య నవ్వుతూ అన్నాడు. "ఆగు... ఆగు... మీరు ఇక్కడకు రావటమే మహదానందం... ఇక్కడ దొరకనివి ఏవీ లేవుగానీ, చేతులూపుకుంటూ హాయిగా వచ్చేయండి... లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్!"

"ఎక్కు...ఎక్కు...." అన్నాడు నాలుగు పెట్టెలు దాటింతరువాత ఆ జనసందోహంలో ఈదటం ఆపి-ఎస్ సెవన్ కనబడగానే.

ఎక్కి బెర్త్ నంబర్లు చూచుకుంటూ ముందుకు వెళ్ళారు.

"యిరవై అయిదు... యిరవై ఎనిమిదీ ఇవ్వేనండీ!" అన్నది ముందు నడుస్తున్న కావేరి.

సామాన్లు పైబెర్త్ మీద పెట్టాడు. రెండూ కిటికీ పక్కన సీట్లే. అప్పటికే అటు పక్క ఇద్దరు ఇటు పక్క ఇద్దరు కూర్చుని వున్నారు. వాళ్ళు నాంపల్లిలో ఎక్కినట్లున్నారు.

"నేను సామాన్లను పైన పెట్టమంటుంటే క్రింద పెడతారేమిటి?" సైడ్‌బెర్త్ దగ్గర సామాన్లతో ఎక్కిన దంపతులు- ఆమె అతడిని అరుస్తున్నట్లుగా అంటున్నది- వాళ్ళూ సికింద్రాబాద్‌లోనే ఎక్కారు. వారిద్దరి నడుమా ఓ పాప... ఆరేడు ఏళ్ళుంటాయి...

"పెడతానే పెడతాను... ఇంకా జనం ఎక్కుతున్నారా... హడావుడి తగ్గనీయ్... ఇంకో అరగంటలో టిఫెన్లు తినాలా... మంచినీళ్ళు త్రాగాలా... చేతులూ, మూతులూ

తడుచుకునేటందుకు తువ్వాల తీయాలా... చదువుకునేటందుకు ఏదైనా పుస్తకం కావాలా... బండి బయల్దేరిం తరువాత అన్నిపనులూ పూర్తిచేసుకొని అప్పుడు పైనపడేద్దాం... సరేనా!... ఊరికినే అరుపులు తప్ప ఆలోచనలు లేవు!" అన్నాడు ఆయన నవ్వుతూ.

"ఎంతసేపూ మీకు తిండిరంధి... దానికి నిద్రరంధి... కావాలంటే దించుకోవచ్చుగాని కాళ్ళ దగ్గర సామాన్లు పెట్టటానికి వీల్లేదు... ఆ పెట్టెలో తిరుపతి ప్రసాదం వున్నదని చెప్పానా– అయినా కాళ్ళ దగ్గరే పెడతానంటారేమిటి బుద్ధిలేకుండా!" ఆమె ఆగటంలేదు.

"ఇది మన ఇల్లనుకున్నావటే నీ ఇష్టమొచ్చినట్లు వాగటానికి... ఏం మాట్లాడుతున్నావ్... నేను ఇక్కడే పెడతా... ఏం చేస్తావో చేసుకో!"

"నాకు తిక్క రేగిందంటే పిల్లముండను తీసుకొని ఏదో ఒక స్టేషన్‌లో దిగిపోతా... జీవితాంతం వండుకు తినలేక ఛస్తారు మీరు!"

"ఇంకేదో స్టేషన్‌లో దిగటం దేనికి... ఇక్కడే దిగు... నీ టిక్కెట్టుకు రీఫండ్ అన్నా తీసుకోవచ్చు!"

అందరూ మాటలాపి వింతగా వాళ్ళనే చూస్తున్నారు.

ఉన్నట్లుండి ఆ పిల్ల గంయ్‌మంటూ ఏడ్వటం మొదలుపెట్టింది.

"ఇక మీరు నోరు మూసుకుంటే మంచిది. అది దడుసుకు చచ్చేలా వున్నది... రా తల్లీ రా! నా ఒళ్ళో పడుకుందువుగాని... ఆయన ఎలాగూ మనమాట వినడుగాని నేను ఇటు కూర్చుంటాను... ఆ తిరుపతి ప్రసాదం పెట్టిన పెట్టెవైపు తమరు కూర్చోండి... ఆ చుట్టుకుండే పాపమేదో మీరే నెత్తికి రాసుకోవచ్చు... నాదేంబోయింది!" అంటూ ఆమె సీట్లో కూర్చున్నది పిల్లను దగ్గరకు తీసుకుంటూ.

ఆయనకు నలభైయేళ్ళకు పైనే వుంటయిగాని సన్నగా పీలగా– బుగ్గలు లోపలకుపోయి యాభై పైబడ్డ వాడిలా వున్నాడు. ఆమె లావుగా పొట్టిగా దిబ్బరొట్టెలా

వున్నది. ఆమెకూ నలభైదాకా వుంటయి. పిల్లదంతా తల్లి పోలికే.

పది నిముషాలల్లో ఎక్కవలసిన వాళ్ళంతా ఎక్కి సీట్లలో కూర్చున్నారు. రైలింజన్ కూత కూయడంతో ప్రయాణీకులను ఎక్కించటానికి వచ్చిన వాళ్ళూ దిగిపోయారు.

ఉన్నట్లుండి ఆ బక్కాయన ఆ భాగంలో వున్న తోటి ప్రయాణీకుల వైపుకు తిరిగి, "నమస్కారం! మీరంతా ఢిల్లీకే వెళుతున్నారనుకుంటాను... మనం యిరవై ఆరు గంటలు కలసి ప్రయాణం చేయాలి కాబట్టి పరిచయాలు చేసుకుందాం! నా పేరు అంజనీ ప్రసాదు... ఈమె నా భార్య భ్రమరం... భయపడబోకండి- ఎవ్వరినీ కుట్టదు!" ఆ మాట అని పళ్ళన్నీ బయటపడేలా నవ్వుతుంటే ఆమె అతడి చొక్కా పట్టుకొని ఒక్క గుంజు గుంజింది. "ఇక మా పిల్ల పేరు పుట్టిన నక్షత్రం ప్రకారం హిడింబి... కానీ వ్యావహారిక నామం మధురం... తియ్యగా పాటలు పాడుతుంది!" అన్నాడు చేతులు జోడించి రైలు కదలటం ఆలస్యం.

కావేరి ఆ దంపతుల వంక విచిత్రంగా చూచింది. వాళ్ళ మాటతీరు చూస్తుంటే ఆమెకు నవ్వాగటం లేదు- ఈ ప్రయాణంలో వాళ్ళు తమకు మంచి కాలక్షేపమే అవుతారు అనుకున్నది.

"అయ్యా! ఇక మీరుచెప్పండి మీ ప్రవర!" అన్నాడు ఆయన కాళ్ళను క్రిందవున్న పెట్టెకు తగలకుండా దూరంగా జరుపుతూ.

"నా పేరు ఆదిత్య... నాభార్య పేరు కావేరి... నేను సాఫ్ట్‌వేర్ ఇంజనీరుని... మాకు పెళ్ళయి రెండేళ్ళయినా ఇంకా పిల్లలు లేరు... ఒకవిధంగా ఇప్పుడిప్పుడే వద్దని మేమే అనుకున్నాం!" అతడు ఆమాట అంటూ భార్యవంక చూచాడు.

కావేరి ముఖం భర్త మాటలకు ఎర్రబడింది.

"లేపేయమంటారా?" అడిగాడు ఎదురుగ్గా వున్న లావుపాటి మనిషి ఆదిత్యను చూస్తూనే.

కంగారు పడ్డాడు అతడి మాటకు ఆదిత్య.

"చెమటపోస్తోంది... అద్దం పైకి లేపేస్తాను!" అన్నాడు ఆదిత్య మీదనుంచి చూపు మరల్చుకుంటూ– కిటికీ అద్దాన్ని పైకిలాగుతూ అతడు.

"మీ పేరు?" అంజనీ ప్రసాదు అడిగాడు.

"రాంపండు! ఇప్పటికి ఇరవై అరు పెద్దవి... ఇరవై ఆరు చిన్నవీ చేశాను... ఇప్పుడూ అదే పనిమీద ఢిల్లీ వెళుతున్నాను!"

మళ్ళీ కలవరపడ్డాడు ఆదిత్య.

అంజనీప్రసాదు కుతూహలంగా ముందుకు వంగి అడిగాడు. "ఏమిటి మీరు చేసింది?" అంటూ.

"ఈ సంవత్సరం వినాయకుడి విగ్రహాలు... అక్కడేదో పెద్ద ఆర్డరు వస్తుందని జాంపండు ఫోను చేస్తే వెళుతున్నాను... నా పెట్ట తెరిచినప్పుడు పాస్ బుక్కు చూపిస్తాను!" అన్నాడు సమ్మర్‌క్రాఫ్ మీద చేయివేసి బరబరా రుద్దుకుంటూ.

ఆయన పక్కన కూర్చున్న మరో లావుపాటి ఆయన వంకకు తిరిగి అడిగాడు అంజనీ ప్రసాదు. "మీ సంగతి చెప్పనే లేదు!"

"నేను చెప్పేదేంవున్నది... పొలాలకు వెళ్ళి కిలో పదిరూపాయలు చొప్పున పల్లీలు కొంటాను... వాటిని ఉప్పు నీళ్ళల్లో ఉడకేసి నలభై చొప్పున మార్కెట్‌లో అమ్ముతాను... నాలుగు రెట్లు లాభం!" అన్నాడు పొట్ట సర్దుకుంటూ.

"తమరి పేరు?"

"ధర్మలింగం... మా వాళ్ళంతా నన్ను ధర్మకాటాలాంటి వాడినని మెచ్చుకుంటుంటారు!"

ఎదురుగ్గా కావేరి పక్కన ఓ దంపతులు కూర్చున్నారు. వాళ్ళ వంక తిరిగాడు అంజనీప్రసాదు.

"మేం మొగుడూ పెళ్ళాలమండీ!" అన్నాడు ఆయన నవ్వి. "మేమూ ఢిల్లీనే

వెళుతున్నాం!"

రైలు స్పీడందుకున్నది.

అంజనీప్రసాదు ఎలాంటి విషయాల్లోనైనా ఆవలిస్తే పేగులు లెక్కపెట్టే మనిషి. మొగుడు, పెళ్ళాం అని ప్రత్యేకంగా చెబుతున్నాడూ అంటే- ఇదేదో పారిపోయి వస్తున్న బాపతులా అనిపించింది అతడి బుర్రకి- వాళ్ళను ఓ పట్టు పట్టాల్సిందే అనుకున్నాడు.

"ఏ ఊరు?"

"గుంటూరు!"

"మీరు కాజీపేటలో ఎక్కవచ్చుగదా... ఇక్కడిదాకా ఎందుకు వచ్చారు?" అతడు లా కొన్నాళ్ళు చదివి- తన తెలివి ముందు అది చాలా చిన్న సబ్జక్టనిపించగా వదిలేశాడు. ఆ తరువాత భ్రమరం చేతిలో పడ్డాడు!

"నిజమేననుకోండి... మా తమ్ముడు చార్మినార్ దగ్గరనుంచి మంచి ముత్యాలు, గాజులు తెమ్మనమంటే ఇక్కడకు రావాల్సి వచ్చింది!"

"గూడ్... బాగున్నది... మీ పేరు?"

"వెంకటాచలం... మా ఆవిడ పేరు అచ్చమాంబ!"

ఆమెపేరు అతడు చెబుతుండగానే ఆమె ఒకసారి పమిటసర్దుకొని రెండు చేతులూ జోడించి, "నమస్కారమండీ!" అన్నది.

"బాగున్నదమ్మా బాగున్నది... నమస్కారం... అదీ పద్ధతంటే!" అం.ప్రసాదు సంతోషంగా అన్నాడు.

"కాఫీ... కాఫీ... వేడివేడి నెస్‌కాఫీ!"

కావేరి తలెత్తింది ఎదురుగ్గా వున్న భర్త వైపుకు చూస్తూ, 'తాగుదామా' అన్నట్లుగా. మెళ్ళో మూడు పేటల చంద్రహారం గుచ్చుకుంటున్నట్లనిపించగా సర్దుకుంటూ. తరువాత

గొలుసు బయటకు కనబడకుండా పమిట కప్పుకున్నది భుజం మీదగా.

ఆదిత్య రెండు కాఫీ కప్పులు అందుకొని ఒకటి భార్యకిచ్చాడు. కావేరికి భర్త ప్రవర్తన కాస్త వింతగానే వున్నది. ఢిల్లీ ప్రయాణం అనుకున్నప్పటినుంచీ– ఆయన తను ఏమాటన్నా తలూపేస్తున్నాడు. అంతకు ముందు ప్రతిమాటకూ– తనేదో తప్పు మాట్లాడినట్లుగా చికాకు పడుతుండేవాడు. అరుస్తుండేవాడు.

తన పెళ్ళయిం తరువాత తన మాటకు ఈ పదిహేను రోజులబట్టే మొట్టమొదటిసారిగా విలువ ఇస్తున్నది– అనుకున్నప్పుడు మనస్సులోనే నవ్వుకున్నది– తన వాళ్ళకు ఆయన గురించి చెప్పేస్తానేమోనని భయపడుతున్నాడేమో!

మరీ మూడు రోజుల క్రితం అయితే తనకు మెళ్ళోకి చంద్రహారం, నాలుగు జతల గాజులు, తెల్లరాళ్ళ దుద్దులు తెచ్చాడు. తను ఆయన్ను ఏమైనా కొనమని అడగటం ఎన్నడో మానేసింది. వెధవ్వి కట్టుడు చీరలు, కాటన్ లంగాలు కొనుక్కుంటానంటేనే కసురుకుంటుండేవాడు. అటువంటిది ఇంతడబ్బుపెట్టి ఇవన్నీ కొనుక్కు వచ్చాడు అంటే– నోరు మూతపడక ఆశ్చర్యంతో ఆయన్నే చూస్తూ వుండిపోయింది.

ఆపైన తనను దగ్గరకు తీసుకొని, “మనం వారం రోజులు సరదాగా తిరగటానికి వెళుతున్నాం... అన్నీ పెట్టేసుకో ... మీ అన్నయ్య దగ్గర కెమేరా వున్నదా... లేకపోతే నన్ను కొనమంటావా?” అడిగాడు.

తనకు ఆనందంతో ఏం మాట్లాడాలో తెలియలేదు.

“ఇంత డబ్బెక్కడిదండీ... అయినా దూరప్రయాణం... కొత్త ప్రదేశం... ఇవన్నీ పెట్టుకు తిరుగుతుంటే ఇంకేమైనా వున్నదా?” అన్నది కోపం నటిస్తూ.

ఆయన పకపకా నవ్వాడు. “అంత పిచ్చోడిననుకుంటున్నావా నేను... అవన్నీ గోల్డ్ కవరింగ్‌వి... అందుకే మనం ఊరికి పోయేముందు కొన్నది... ఢిల్లీలో వున్న వారం రోజులూ తళతళలాడుతుంటయి!” అన్నాడు కన్నుగొడుతూ. “అవునూ– ఒక్కసారి

అవన్నీ పెట్టుకొని నా ముందుకు రా... ఎంత అందంగా వుంటావో చూస్తాను!"

ఆయన చెప్పిందీ సబబుగానే వున్నట్లనిపించింది. అన్ని సొమ్ములు పెట్టుకుంటే హుందాగానూ వుంటుంది– పోతయ్యనే భయమూ లేదు!

డ్రస్సింగ్ టేబుల్ ఎదురుగ్గా కూర్చొని మెళ్ళో వున్న నానుతాడు, నల్లపూసల గొలుసుకు తోడుగా చంద్రహారం వేసుకున్నది. చెవులకున్న పాత దిద్దులు తీసి కొత్తవి పెట్టుకున్నది. చేతికి గాజులు వేసుకున్నది.

"చీర గూడా మార్చుకుండేదా?" అన్నది కొంటెగా భర్త ముఖంలోకి చూస్తూ– ముద్దొచ్చినప్పుడే చంకెక్కాలన్నది సామెత...

ఆయన ఆలోచిస్తున్నట్లుగా బుగ్గన చిటికినవేలుతో కొట్టుకుంటూ, కళ్ళు మూసుకొని, "అదే ఆలోచిస్తున్నాను... అసలు అన్ని సొమ్ములు పెట్టుకున్న తరువాత చీర కట్టుకోవాలా అని!" అన్నాడు తన్మయంగా కళ్ళు మూసుకు తెరిచి.

రైలు పెద్ద మ్రోతచేసుకుంటూ దూసుకు పోతున్నది.

– ఆ క్షణాలు గుర్తుకు రాగా గిలిగింతలు పెట్టినట్లనిపించి, ఆనందాన్ని ఆపుకోలేక, పెదాల్ని బిగుంచుకున్నది బలవంతంగా. అది గమనించాడు ఆదిత్య.

"నీ ఆనందమేమిటో నాకు చెబితే నేనూ సంతోషిస్తానుగదా!" అన్నాడు భార్య చేతిమీద చేయి వేసి.

సిగ్గుగా భర్త ముఖంలోకి చూస్తూ, "ఇప్పుడుకాదు... ఎప్పుడైనా రాత్రిపూట చెబుతాను!" అన్నది గుసగుసగా.

"కట్‌లెట్... కట్‌లెట్... వేడివేడి కట్‌లెట్!"

"అమ్మా కట్‌లెట్టే!" అన్నది దిబ్బరొట్టె కూతురు.

"తీసుకో అమ్మా! ఇదుగో అబ్బాయి... ఒకటి ఇటు ఇవ్వు... ఎంత?"

"పది రూపాయలు!"

“ఆఁ... ఒకటా... నీ దగ్గర వున్నవన్నీ కలిపా?”

“ఒకటే... జామ్ వేయమంటారా?”

“పది రూపాయలేంటి... పదిరూపాయలు... చిన్న పిల్ల అడుగుతున్నదనే జాలిగూడా లేకుండా!” నిరసనగా అన్నది భ్రమరం.

“అది అంతేనమ్మా!... ఇదుగోండి తీసుకోండి!”

“నాకక్ఖర్లేదు... పదిరూపాయలెక్కువ!”

“ఇవ్వమంటిరిగదా... దానిమీద జాం వేసింతరువాత తీసుకోనంటే ఎట్లా!” విసురుగా అన్నాడు అతను.

“అదేం నాకు తెలియదు... అయిదు రూపాయలకు ఇస్తే ఇవ్వు... లేకపోతే లేదు... నేను సుల్తాన్‌బజారుకు వెళ్ళినా అంతే... వాళ్ళు చెప్పిందాంట్లో సగం రేటుకే అడుగుతాను...అట్లాగే వాళ్ళు ఇస్తారుగూడా!” అన్నది ముఖాన్ని బయటకు తిప్పుకుంటూ– ఇక ఇవ్వక చస్తాడా అన్నట్లుగా.

“ఏఁవమ్మోవ్... మర్యాదగా వుండదు... పదిరూపాయలు తీయిముందు!”

‘ఇవ్వకపోతే ఏం చేస్తావేం?” అన్నది చిరాగ్గా తలెత్తి భ్రమరం.

“ఇక్కడే నిల్చొని తిట్టిన తిట్టు తిట్టకుండా ఢిల్లీ వెళ్ళిందాకా అన్ని భాషల్లోనూ తిడుతూనే వుంటాను!” అన్నాడు మీదమీదకి వస్తూ.

“అమ్మో! నాకు భయమేస్తున్నదండీ వీడి ముఖం చూస్తుంటే... పదిరూపాయలు వాడి మొహానకొట్టి పంపేయండి!” అన్నది మొగుడివంక పిచ్చిచూపులు చూస్తూ భ్రమరం.

అం.ప్రసాదు నవ్వుకుంటూ పర్సుతీసి పదిరూపాయల నోటు అతడికిస్తూ, “థాంక్స్!” అన్నాడు.

అతడు విచిత్రంగా ఆయన వంక చూచి డబ్బు తీసుకొని, జామ్ వేసిన కట్‌లెట్ వున్న పేపరు ప్లేటును అతడి చేతిలో పెట్టి వెళ్ళిపోయాడు ముందుకు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Iravai+Aru+Gantalu**

* * *